సాక్షి అనకాపల్లి

మంగళవారం । 16 । మే । 2023



అర్జీల పరిష్కారానికి.. 8లో

కలెక్టరేట్ స్పందనకు 202 అర్జీలు వచ్చాయి. వాటి పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యమివ్వాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.



షూటింగ్ ప్రారంభం 8లో

కోరుకొండ గోపీకృష్ణ దర్శకత్వంలో కొత్త సినిమా షూటింగ్ ప్రారంభమైంది. జూలైలో విడుదల చేస్తామని దర్శకుడు తెలిపారు.



కాటన్‌కు ఘన నివాళి

విశాఖ: ఏయూ సివిల్ ఇంజినీరింగ్ విభాగంలో సర్ అర్థర్ కాటన్ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి నివాళులర్పించారు.

న్యూస్‌రీల్

రోడ్డు ప్రమాద బాధిత కుటుంబాలకు పరిహారం



మృతుడు శ్రీను కుటుంబసభ్యులకు చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే కన్నబాబురాజు

అచ్యుతాపురం (అనకాపల్లి): వెదురువాడ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కిలాడి శ్రీను, కారుకొండ శ్రీను కుటుంబసభ్యులను ఎమ్మెల్యే కన్నబాబురాజు సోమవారం ఓదార్చారు. రోడ్డు ప్రమాదానికి కారణమైన ట్రావెల్స్ యాజమాన్యం ఇచ్చిన 6.5 లక్షల చెక్కులను ఈ సందర్భంగా ఆయా కుటుంబీకులకు ఆయన అందజేశారు. ఆయన వెంట డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ, ఎంపీపీ కోన బుజ్జి, మాజీ ఎంపీపీ చేకూరి శ్రీనివాసరాజు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు దేశంశెట్టి శంకర్‌రావు తదితరులు ఉన్నారు.

104 వాహనాల్లో డేటా ఎంట్రీ పోస్టులు ఖాళీ

అనకాపల్లి టౌన్: జిల్లాలో 104 వాహనాల్లో నాలుగు డేటా ఎంట్రీ పోస్టులు ఖాళీగా ఉన్నట్టు వాహనాల జిల్లా మేనేజర్ కోరుకొండ రమణ అచ్యుతరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అనకాపల్లి, నర్సీపట్నం డివిజన్లలో రెండేసి పోస్టులు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. ఏదైనా డిగ్రీలో ఉత్తీర్ణత సాధించి, కంప్యూటర్ ఎక్సెల్ పవర్‌పాయింట్ పరిజ్ఞానం గల నిరుద్యోగుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఆయన తెలిపారు. మంగళవారం సాయంత్రం 4 గంటల్లోపు సబ్బవరం పీహెచ్‌సీ 104 జిల్లా కార్యాలయంలో దరఖాస్తు సమర్పించాలన్నారు. బుధవారం పరిశీలన అనంతరం నియామకాలు చేపడతామని చెప్పారు. మరిన్ని వివరాలకు ఫోన్ 9949623144, 7981381514 నంబర్లను సంప్రదించాలని ఆయన కోరారు.

పకడ్బందీగా పాలిటెక్నిక్ పరీక్షలు




పెందుర్తి కాలేజీలో ల్యాబ్ పరికరాలను పరిశీలిస్తున్న సత్యనారాయణమూర్తి

మురళీనగర్(విశాఖ ఉత్తర): రాష్ట్రంలోని పాలిటెక్నిక్ కాలేజీల్లో విద్యార్థులకు వార్షిక పరీక్షలు పకడ్బందీగా జరుగుతున్నాయని రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ సంయుక్త కార్యదర్శి (అకడమిక్) జీవీవీ సత్యనారాయణ మూర్తి చెప్పారు. పాలిటెక్నిక్ విద్యార్థులకు వార్షిక పరీక్షలు ఈనెల 12వ తేదీ నుంచి జరుగుతున్నాయి. సీ-20 సిలబస్‌కు సంబంధించి ఫస్టియర్ వార్షిక పరీక్షలతోపాటు సెకండియర్ థర్డ్ సెమిస్టర్ సప్లమెంటరీ, ఫోర్త్ సెమిస్టర్ రెగ్యులర్, సప్లమెంటరీ పరీక్షలు నిర్వహిస్తున్నారు. నగరంలోని ఆళ్వార్‌దాస్ పాలిటెక్నిక్ కాలేజీ, పెందుర్తి ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ, కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ, చైతన్య పాలిటెక్నిక్ కాలేజీ పరీక్ష కేంద్రాలను సోమవారం ఆయన సందర్శించారు. కేంద్రాల్లో సీటింగ్ ఏర్పాట్లు, మంచినీటి సౌకర్యాలు, ప్రయోగశాలల్లో ఏర్పాట్లు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో సోమవారం 584 మందికి 569మంది హాజరవడంతో 97శాతం హాజరు నమోదైంది. కెమికల్ ఇంజినీరింగు కాలేజీలో 240 మందికి 239 మంది పరీక్షలకు హాజరు కావడంతో 99.5శాతం నమోదైంది.

నేడు జాబ్ మేళా

మురళీనగర్(విశాఖ ఉత్తర): ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో కంచరపాలెం ఓల్డ్ ఐటీఐలో మంగళవారం జాబ్ మేళా నిర్వహిస్తామని సంస్థ జిల్లా అధికారి సాయికృష్ణ చైతన్య, ఐటీఐ కాలేజీ ప్రిన్సిపాల్ డా. శ్రీకాంత్ తెలిపారు. ఐటీ కంపెనీలైన డబ్ల్యూఎన్ఎస్, ఫిన్‌సోల్‌తో పాటు యాక్ట్ ఫైబర్ నెట్ కంపెనీలో 150 పోస్టుల భర్తీకి ఈ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నామన్నారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, బీటెక్, ఐటీఐ, పూర్తి చేసిన ఉత్తరాంధ్రలోని యువత దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఎంపికైన అభ్యర్థులకు అర్హతల ఆధారంగా నెలకు రూ.10,000 నుంచి రూ.20,000 వరకు జీత భత్యాలు ఉంటాయని, దువ్వాడ సెజ్‌లో పనిచేయాల్సి ఉంటుందని తెలిపారు. వయో పరిమితి 18 నుంచి 35 ఏళ్లుగా నిర్ణయించినట్లు చెప్పారు. మరిన్ని వివరాలకు 92925 53352లో సంప్రదించవచ్చు.

మానసిక ఆస్పత్రి సూపరింటెండెంట్ బాధ్యతల స్వీకరణ



ఏయూక్యాంపస్: ప్రభుత్వ మానసిక ఆస్పత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా డాక్టర్ కె.వి.రామిరెడ్డి సోమవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం సైకియాట్రి విభాగాధిపతిగా సేవలు అందిస్తున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ కె.వి.రామిరెడ్డిని ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది అభినందించారు.

అందాల తోవ.. కలువల ఆవ

- కొండకర్ల ఆవలో రూ.20 లక్షలతో ఫ్లోటింగ్ జెట్టీ పునరుద్ధరణ
- సందర్శకులు, మత్స్యకారులకు ఉపయుక్తం
- ఎంపీ సత్యవతి, ఎమ్మెల్యే కన్నబాబురాజు చొరవతో నిధులు మంజూరు
- 20 రోజుల్లో సిద్ధం చేసిన అధికారులు



కొండకర్ల ఆవ ఫ్లోటింగ్ జెట్టీ నిర్మాణం (రబ్బరు వంతెన)

సాక్షి, అనకాపల్లి: కొండకర్ల ఆవ.. కొల్లేరు సరస్సు తర్వాత అంతటి పెద్ద మంచినీటి సరస్సు. కొండలు, కొబ్బరి చెట్లు ఆవకు ప్రత్యేక అందాన్ని చేకూర్చుతున్నాయి. సైబీరియా తదితర దేశాల నుంచి పక్షులు ఇక్కడకు వలస వస్తాయి. అది ఇక్కడి ప్రత్యేక ఆకర్షణ. సరస్సులో అందమైన కలువ పువ్వులు.. రంగురంగుల పక్షులు.. వీటి మధ్యలో బోటింగ్... సందర్శకులకు మధురానుభూతి కలిగిస్తుంది. గతంలో ఆవలో తాటి దోనెలపై విహరించేవారు. కొత్తగా బోట్లు ఏర్పాటు చేశారు. వాటి పైకి ఎక్కేందుకు ఆవ గట్టు మీదుగా వెళితే ఇబ్బంది కలుగుతుందని కొన్ని సంవత్సరాల క్రితం ఫ్లోటింగ్ జెట్టీ (రబ్బరు వంతెన) ఏర్పాటు చేశారు. హుద్‌హుద్ తుపానుతో ధ్వంసమైన ఫ్లోటింగ్ జెట్టీ పునరుద్ధరణకు ఇటీవల ఎంపీ డాక్టర్ సత్యవతి వినతి మేరకు జిల్లా కలెక్టర్ వీఎంఆర్డీఏ నుంచి నిధులు మంజూరు చేయించారు. రూ.20 లక్షలతో చేపట్టిన ఈ నిర్మాణం కేవలం 20 రోజుల్లో పూర్తయింది. మరో రెండు రోజుల్లో ప్రారంభానికి కూడా సిద్ధమైంది. మత్స్యకారులు బోట్లను దించుకోవడానికి.. లోడింగ్, అన్‌లోడింగ్ చేసుకోవడానికి కూడా ఇది అనువుగా ఉంటుంది. ఇక్కడ పిల్లల పార్కును ఆనుకొని గోడ నిర్మించనున్నారు. తద్వారా బోటుపై ప్రయాణించే వారికి మంచి వెసులుబాటు కలగనుంది.

పట్టించుకోని టీడీపీ ప్రభుత్వం

గత టీడీపీ ప్రభుత్వ హయాంలోనే రబ్బరు వంతెన పూర్తిగా శిథిలావస్థకు చేరింది. గతంలో చాలాసార్లు అప్పటి ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా ఉపయోగం లేకపోయింది. మూడు నెలల క్రితం కొండకర్ల ఆవ మాజీ సర్పంచ్ దుంగా వెంకటరమణ ఆధ్వర్యంలో స్థానిక ఎమ్మెల్యే కన్నబాబురాజుకు వినతిపత్రం అందజేశారు. ఇక్కడ బోటింగ్ చేసే సమయంలో, మత్స్యకారులు వేటకు వెళ్లే సమయంలో ఉపయుక్తంగా ఉండేలా వేసిన రబ్బరు వంతెన శిథిలావస్థకు చేరుకుందని, ఇబ్బందులు పడుతున్నామని విన్నవించడంతో కన్నబాబురాజు ఎంపీ డాక్టర్ బి.వి.సత్యవతి దృష్టికి వెళ్లారు. వెంటనే ఎంపీ వీఎంఆర్‌డీఏ కమిషనర్, విశాఖ కలెక్టర్ డాక్టర్ మల్లికార్జునతో మాట్లాడారు. రూ.20 లక్షల నిధులు మంజూరు చేయించారు.

ఆవ ప్రత్యేకతలివీ..



- 1800 ఎకరాల్లో విస్తరించి ఉన్న కొండకర్ల ఆవ వాస్తవానికి అచ్యుతాపురం-మునగపాక మండలాల సరిహద్దులో ఉంది. దీంతో అచ్యుతాపురం మండలం వారు కొండకర్ల ఆవగా, మునగపాక మండలం వారు వాడ్రాపల్లి ఆవగా పిలుస్తుంటారు. ఈ రెండు గ్రామాల మధ్య చేసే ఆవ విహారమే పర్యాటకంలో హైలైట్‌గా నిలుస్తుంది.
- రోజుకు సగటున ఇక్కడకు 100 మంది వరకు సందర్శకులు వస్తారు. వీకెండ్స్‌లో అయితే ఆ సంఖ్య రెట్టింపు అవుతుంది.
- ఈమధ్య కాలంలో ప్రీ వెడ్డింగ్ షూట్స్, లఘు చిత్రాల షూటింగ్స్ ఎక్కువగా జరుగుతున్నాయి.

రూ.25 లక్షలతో వ్యూ పాయింట్

అచ్యుతాపురం (అనకాపల్లి): వందలాది ఎకరాల్లో విస్తరించి ఉన్న కొండకర్ల ఆవను వీక్షించేందుకు వ్యూ పాయింట్‌ను నిర్మించనున్నారు. రూ.25 లక్షలతో ఏర్పాటు చేయనున్న వ్యూపాయింట్ ద్వారా ఆవ మొత్తాన్ని వీక్షించవచ్చు. పక్షుల కిలకిలలు, కొండలు, ఆవలోని రకరకాల పూల అందాలను వీక్షించే వ్యూపాయింట్ ప్రత్యేక ఆకర్షణ కానుందని పర్యాటక శాఖ ఏఈ సీతారాం చెప్పారు. ఆవలోని అందాలను వీక్షించాలనే వారి కోసం ప్రత్యేకమైన యాప్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ఈ యాప్‌లో ఆవలోని ప్రత్యేకతలను పర్యాటకులు ఎక్కడి నుంచైనా తెలుసుకోవచ్చు. రిమోట్ సెన్సింగ్, జీఐఎస్ వంటి సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ఆవ సరిహద్దుల్ని గుర్తించనున్నారు. చిత్తడి నేలల పరిరక్షణకు స్నేహపూర్వక-పర్యాటక పరిరక్షణ రిజర్వ్ కమిటీని కూడా నియమించారు. చిత్తడి నేల సంరక్షణ కమిటీ ద్వారా అటవీ శాఖ రంగంలోకి దిగి వ్యవసాయం, ఉద్యానవనం, నీటిపారుదల శాఖ, పర్యాటక రంగాలను కలుపుకొని పర్యాటకులకు మంచి అనుభూతిని మిగల్చనుంది. స్థానిక మత్స్యకారుల ఉపాధికి దెబ్బ తగలకుండా చేపల పెంపకానికి, బోట్లను తిప్పడంలోనూ మత్స్యకారులకే అవకాశం కల్పించనున్నారు.

ఎమ్మెల్యే, ఎంపీలకు ధన్యవాదాలు



మా విన్నపాన్ని మన్నించి కేవలం మూడు నెలల వ్యవధిలోనే నిర్మాణం చేపట్టారు. రబ్బరు వంతెన శిథిలావస్థకు చేరడంతో చాలా ఇబ్బందులకు గురయ్యాం. ఎమ్మెల్యే కన్నబాబురాజు, ఎంపీ సత్యవతిల దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లడంతో నిధులు మంజూరు చేయించి ఈ నిర్మాణాన్ని కేవలం 20 రోజుల్లో పూర్తి చేశారు. మా గ్రామం నుంచి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నాం.

–దుంగ వెంకటరమణ, మాజీ సర్పంచ్, కొండకర్ల ఆవ

వేట సమయంలో ఉపయోగకరం



రబ్బరు జెట్టీని నిర్మించడం చాలా సంతోషంగా ఉంది. సుమారు 100 మత్స్యకార కుటుంబాలకు వేట సమయంలో ఉపయోగపడుతుంది. ప్రభుత్వానికి, అధికారులకు ఎప్పటికీ రుణపడి ఉంటాం.

–ఎన్.రమణబాబు, మత్స్యకారుడు. కొండకర్ల ఆవ

రెండు రోజుల్లో ప్రారంభిస్తాం

వీఎంఆర్‌డీఏ నిధులతో ఈ జెట్టీ నిర్మాణం చేపట్టాం. ముంబాయికి చెందిన నిర్మాణదారు ఈ పనులు నిర్వహించారు. ప్లాస్టిక్‌తో చేసిన ఈ జెట్టీ పరికరాలను ముంబాయి నుంచి తీసుకొచ్చి ఇక్కడ ఏర్పాటు చేశాం. నిర్మాణ పనులు పూర్తయ్యాయి. మళ్లీ ఒకసారి పరిశీలించాక రెండు రోజుల్లో ప్రారంభిస్తాం.

– రవిశంకర్, అసిస్టెంట్ ఇంజినీర్, వీఎంఆర్‌డీఏ

ఏయూ బీటెక్ పరీక్ష ఫలితాల విడుదల



ఫలితాలు విడుదల చేస్తున్న వీసీ ప్రసాద రెడ్డి

ఏయూక్యాంపస్: ఆంధ్రవిశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ చివరి సంవత్సరం చివరి సెమిస్టర్ పరీక్ష ఫలితాలను సోమవారం సాయంత్రం ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి తన కార్యాలయంలో విడుదల చేశారు. రికార్డు సమయంలో కేవలం వారం రోజుల్లో ఫలితాలను అందించారు. రాష్ట్రంలో పరీక్షలు సకాలంలో నిర్వహించి, సత్వరం ఫలితాలను అందించిన తొలి విశ్వవిద్యాలయం ఏయూనే కావడం విశేషం. ఈ సంవత్సరం భారీగా ఏయూ విద్యార్థులు ఉపాధి అవకాశాలను సాధించారు. అదేవిధంగా పెద్దసంఖ్యలో ఏయూ విద్యార్థులు విదేశీ విద్యను అభ్యసించడానికి వెళ్తున్నారు. వీరికి ఉపయుక్తంగా ఫలితాలను సకాలంలో విడుదల చేశారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, డీన్‌లు ఆచార్య డి.వి.ఆర్ మూర్తి, ఆచార్య సి.హెచ్.వి.వి భాస్కర రెడ్డి పాల్గొన్నారు.

ఐసీడీటీ కోర్సుల బ్రోచర్ ఆవిష్కరణ

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో నూతనంగా నెలకొల్పిన ఇన్నోవేషన్ సెంటర్ ఫర్ డ్రోన్ టెక్నాలజీస్(ఐసీడీటీ) బ్రోచర్‌ని, కేంద్రం నుంచి అందిస్తున్న కోర్సుల వివరాలతో కూడిన ప్రత్యేక సంచికను ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి తన కార్యాలయంలో విడుదల చేశారు. డ్రోన్ టెక్నాలజీ రంగంలో సాంకేతిక, ఆవిష్కరణ, పరిశోధనల్లో పనిచేసే విధంగా విశ్వవిద్యాలయం, పరిశ్రమల సంయుక్త భాగస్వామ్యంలో ఈ కేంద్రం నెలకొల్పారు. కేంద్రం నుంచి అందించే కోర్సుల వివరాలను ఈ సందర్భంగా విడుదల చేశారు. కార్యక్రమంలో కేంద్రం సీఈఓ ఎస్.కె.వి.సతీష్, ప్రాజెక్ట్ హెడ్ గిరిబాబు, సత్యనారాయణన్ ఉపాధ్యక్షుడు డాక్టర్ ఓ.ఆర్.ఎం.రావు, బిజినెస్ డెవలప్‌మెంట్ మేనేజర్ రేష్మ, సమన్వయకర్త హేమ తదితరులు పాల్గొన్నారు.

కమనీయం.. గౌరీపరమేశ్వరుల కల్యాణం





స్వామివారి కల్యాణం జరిపిస్తున్న అర్చకస్వాములు, కల్యాణంలో పాల్గొన్న దంపతులు

స్థానిక వేల్పులవీధి గౌరీపరమేశ్వరుల ఆలయ ఆవరణలో సోమవారం రాత్రి అమ్మవారి, అయ్యవారి కల్యాణ వేడుకలు కమనీయంగా జరిగాయి. వేదపండితులు చక్రవర్తి, అర్చకులు స్వామివారి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. ఆదివారం ప్రారంభమైన ఆలయ ప్రథమ వార్షికోత్సవాలు కల్యాణంతో ముగిశాయి. వందలాది మంది దంపతులు వేడుకల్లో పాల్గొని స్వామివారి కల్యాణం నిర్వహించారు. అధికసంఖ్యలో భక్తులు కల్యాణాన్ని తిలకించి, పులకించిపోయారు.

- అనకాపల్లి టౌన్

యువత స్వయం ఉపాధి కల్పనకు రుణ సదుపాయం



మాట్లాడుతున్న పరిశ్రమల శాఖ ఏడీ జోగినాథ్

కశింకోట: ప్రధానమంత్రి స్వయం ఉపాధి కల్పన పథకం (పీఎంఈజీపీ) కింద 18 ఏళ్లు నిండిన నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించుకోవడానికి బ్యాంకు ద్వారా రుణాలు ఇవ్వనున్నట్లు జిల్లా పరిశ్రమల శాఖ సహాయక సంచాలకుడు జి.జోగినాథ్ వెల్లడించారు. కశింకోటలోని వెలుగు కార్యాలయంలో గ్రామ స్వయం సహాయక సంఘాల సహాయకులు (వీఓఏ)లతో ఏర్పాటు చేసిన సమావేశంలో సోమవారం ఆయన మాట్లాడారు. యువత నెలకొల్పే యూనిట్‌ను అనుసరించి రూ.లక్ష నుంచి రూ.20 లక్షల వరకు రుణాన్ని పొందవచ్చునన్నారు. అర్హులు ఆధార్ కార్డు, పాన్‌కార్డు, బ్యాంకు పాసు పుస్తకం, కుల ధ్రువీకరణ పత్రం, పంచాయతీలో జనన ధ్రువీకరణ పత్రం నకళ్లతో గ్రామాల్లో సంబంధిత వీఓఏలకు గాని, కశింకోటలోని వెలుగు కార్యాలయంలోగాని సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలన్నారు. సమావేశంలో ఏరియా కో-ఆర్డినేటర్ వి.ధర్మారావు, ఏపీఎం ఎస్.శ్రీనివాసరావు, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు కూండ్రపు అరుణ, కార్యదర్శి అప్పలనరసమ్మ, వీఓఏలు, సీసీలు పాల్గొన్నారు.

ఆరిల్లోవ రహదారి సమస్యకు పరిష్కారం



మార్కింగ్ పనుల కోసం కొబ్బరికాయ కొడుతున్న ఎమ్మెల్యే

- అట్టహాసంగా రోడ్డు మార్కింగ్ ప్రారంభం
- వారం రోజుల్లో నిర్మాణ పనులకు శ్రీకారం
- సీఎం జగన్ చొరవతో తొలగిన వందేళ్ల కష్టం
- నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్

గొలుగొండ: వందేళ్ల రోడ్డు సమస్యకు స్వస్తి చెబుతూ ఆరిల్లోవ అటవీప్రాంతంలో రోడ్డు నిర్మాణానికి తొలి అడుగు పడింది. నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ సోమవారం సాయంత్రం రోడ్డు విస్తరణకు అవసరమైన మార్కింగ్ పనులకు శ్రీకారం చుట్టారు. కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం జగన్‌మోహన్ రెడ్డి చొరవ తీసుకోవడం వల్లనే ఇన్నేళ్ల కల సాకారమైందన్నారు. నర్సీపట్నం-కృష్ణదేవిపేట మార్గంలో ఆరిల్లోవ అటవీ ప్రాంతంలో ఉన్న 3.5 కిలోమీటర్ల మేర రోడ్డు విస్తరణ పనులు జరగక వాహనదారులు అనేక ఇబ్బందులు పడ్డారని తెలిపారు. దీనిపై ఎంతోమంది నాయకులు హామీలు ఇచ్చారే గానీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని తెలిపారు. గొలుగొండ మండలంలో ఉన్న 50 వేల మంది ప్రజలతోపాటు ఇతర జిల్లాలు, తెలంగాణ రాష్ట్ర ప్రజలకు ఉపయుక్తంగా ఉండే ఈ రోడ్డు సమస్యను పరిష్కరించాలని రెండున్నర ఏళ్ల క్రితం రంగంలోకి దిగామన్నారు. అటవీశాఖ అనుమతులు అవసరం కావడంతో సీఎం దృష్టికి తీసుకువెళ్లామని, ఆయన చొరవ తీసుకోవడంతో సమస్య పరిష్కారం అయిందన్నారు. ఇందులో జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారుల కృషి ఎంతైనా ఉందన్నారు. మార్కింగ్ పనుల అనంతరం వారం రోజుల్లో రోడ్డు పనులు ప్రారంభిస్తామని తెలిపారు. కార్యక్రమంలో నర్సీపట్నం ఆర్డీవో జయరాం, నర్సీపట్నం డీఎఫ్‌వో రాజారావు, ఆర్అండ్‌బీ శాఖ ఈఈ బాలసుందర్‌బాబు, డీఈఈ కె.సిద్ధార్థప్రభు, నర్సీపట్నం సీఐ రమణయ్య, తహసీల్దార్ ఆనందరావు, నర్సీపట్నం మార్కెట్ యార్డు చైర్మన్ చిటికెల భాస్కరనాయుడు, ఎంపీపీ గజ్జలపు మణికుమారి పాల్గొన్నారు.

సత్వరమే పూర్తి చేస్తాం

నర్సీపట్నం: దశాబ్దాలనాటి ఆరిల్లోవ రిజర్వ్ ఫారెస్టు రోడ్డు విస్తరణకు శ్రీకారం చుడుతున్నామని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ అన్నారు. ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో హెచ్.వి.జయరాం, డీఎఫ్‌వో రాజారావు, ఆర్అండ్‌బి ఈఈ బాలసుందరం, డీఈ ప్రభుతో ఎమ్మెల్యే సోమవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న రోడ్డును ఆధారంగా చేసుకుని మరో 28 అడుగుల మేర రోడ్డు విస్తరణకు మార్కింగ్ ఇవ్వనున్నట్లు వెల్లడించారు. అటవీ క్లియరెన్స్ రావడంతో సుమారు రూ.10 కోట్లతో త్వరలోనే రోడ్డు విస్తరణ పనులు ప్రారంభించి, సత్వరమే పూర్తిచేస్తామని తెలిపారు.

ఆర్టీసీలో బ్రేక్ జర్నీ!



- దూరప్రాంతాలకు వెళ్లే వారికి సౌలభ్యం
- ఒకే టికెట్‌తో ప్రయాణించేందుకు అవకాశం
- 2 నుంచి 22 గంటల వరకు లే అవర్ చాన్స్
- అందుబాటులోకి మల్టీ సిటీ టికెటింగ్ విధానం
- ఉత్తరాంధ్ర నుంచి పలు నగరాలకు కనెక్టివిటీ సదుపాయం

సాక్షి, విశాఖపట్నం: ఇన్నాళ్లూ విమాన ప్రయాణికులకు మాత్రమే పరిమితమైన బ్రేక్ జర్నీ సదుపాయం ఇప్పుడు ఆర్టీసీ బస్సు ప్రయాణికులకు అందుబాటులోకి వచ్చింది. ప్రస్తుతం దూర ప్రాంతాలకు వెళ్లే వారు బస్సు మారిన ప్రతిసారీ టిక్కెట్టు తీసుకోవలసి వస్తోంది. ఇకపై అలాంటి అవసరం లేకుండా మల్టీ సిటీ టికెటింగ్ సౌలభ్యాన్ని ఆర్టీసీ కల్పించింది. ఏదైనా పట్టణం నుంచి దూరప్రాంతంలో ఉన్న మరో పట్టణానికో లేదా నగరానికో వెళ్లడానికి నేరుగా బస్సు సదుపాయం ఉండడం లేదు. ఇలాంటి వారు తామెళ్లబోయే ప్రాంతానికి ఎక్కడ నుంచి బస్సు సౌకర్యం ఉందో అక్కడకు చేరుకోవలసి వస్తోంది. ఇకపై తాము బయలుదేరే చోట నుంచే గమ్యస్థానానికి ఆన్‌లైన్ ద్వారా ఒకేసారి నేరుగా టిక్కెట్టు పొందవచ్చు. ఉదాహరణకు పార్వతీపురం నుంచి హైదరాబాద్ వెళ్లాలంటే డైరెక్ట్ ఆర్టీసీ బస్సు సర్వీసు లేదు. ఈ ప్రయాణికులు విశాఖకు ఓ బస్సులో వచ్చి హైదరాబాద్ బస్సుకు మరోసారి టిక్కెట్టు తీసుకోవలసి వస్తోంది. ఇది వ్యయ ప్రయాసలతో కూడుకుంటోంది. అంతేకాదు.. వీరు ఎక్కిన ప్రతి బస్సులోనూ రిజర్వేషన్ కోసం కూడా ఇబ్బంది పడాల్సి వస్తోంది. ఈ మల్టీ సిటీ టికెటింగ్ విధానంలో తామెళ్లే బస్సుల్లో ఒకే రిజర్వేషన్ చార్జీతో ప్రయాణించే వీలుంటుంది. మారే బస్సులోనూ ముందుగానే సీటు రిజర్వ్ అయి ఉంటుంది. ఆర్టీసీ కొత్తగా ప్రవేశపెట్టిన ఈ విధానంలో ప్రయాణికుడు తన గమ్యస్థానానికి వెళ్లడానికి బ్రేక్ జర్నీ సదుపాయం ఉంది. తానెళ్లే బస్సు కోసం కనీసం 2 నుంచి గరిష్ఠంగా 22 గంటల వరకు వేచి ఉన్నా బ్రేక్ జర్నీలో ఆ టిక్కెట్టు చెల్లుబాటు అవుతుంది. ఒకవేళ తొలి బస్సులో వెళ్లే వారి బస్సు మార్గంమధ్యలో ఆగిపోతే వెంటనే ఆ ప్రయాణికుడిని మరో బస్సులో పంపించి ప్రయాణానికి ఆటంకం లేకుండా చూస్తారు.

ఉత్తరాంధ్ర నుంచి ఇలా..

ఉత్తరాంధ్ర జిల్లాల్లో విశాఖపట్నం మినహా ఇతర చోట్ల నుంచి దూర ప్రాంతాలకు నేరుగా ఆర్టీసీ బస్సు సదుపాయం లేదు. దీనిని దృష్టిలో ఉంచుకుని విశాఖ సహా శ్రీకాకుళం, పార్వతీపురం, విజయనగరం, పాడేరు తదితర ప్రాంతాల నుంచి బెంగళూరు, చెన్నై, హైదరాబాద్, తిరుపతి, ఒంగోలు, శ్రీశైలం, విజయవాడలకు మల్టీ సిటీ టికెటింగ్ (బ్రేక్ జర్నీ) సదుపాయాన్ని కల్పించారు.

విస్తృత ప్రచారం చేస్తాం..



ఆర్టీసీ యాజమాన్యం అందుబాటులోకి తెచ్చిన మల్టీ సిటీ టికెటింగ్ సదుపాయంపై ప్రయాణికుల్లో అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. దీనిపై కరపత్రాలు ముద్రించి పంచుతాం. టిక్కెట్టు కౌంటర్లలోనూ తెలియజేస్తాం. అక్కడ పోస్టర్లను కూడా అతికిస్తాం. కొత్త విధానంలో ప్రయాణికులు బ్రేక్ జర్నీకి వీలుంటుంది. బస్సు మారిన ప్రతిసారీ రిజర్వేషన్ చార్జీ చెల్లించే అవసరం ఉండదు. బస్సు మారే చోట్ల మళ్లీ టిక్కెట్టు కోసం వేచి ఉంటూ సమయం వృధా కాదు. ఈ సదుపాయాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలి.

– సి.రవికుమార్, జోన్-1 ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్

ఉత్తరాంధ్ర నుంచి మల్టీ సిటీ టికెటింగ్ సదుపాయం ఇలా..

బయలుదేరే చోటు	వయా/బ్రేక్ జర్నీ	గమ్యస్థానం
శ్రీకాకుళం	విశాఖపట్నం	హైదరాబాద్
శ్రీకాకుళం	విశాఖపట్నం	శ్రీశైలం
శ్రీకాకుళం	విశాఖపట్నం	ఒంగోలు
విశాఖపట్నం	రాజమండ్రి	బెంగళూరు
విశాఖపట్నం	కాకినాడ	చెన్నై
పార్వతీపురం	విశాఖపట్నం	హైదరాబాద్
పార్వతీపురం	రాజమండ్రి	బెంగళూరు
విజయనగరం	విశాఖపట్నం	హైదరాబాద్
కొత్త ప్రతిపాదనలు ఇలా..		
పాడేరు	రాజమండ్రి	తిరుపతి
పాడేరు	తుని	విజయవాడ
పార్వతీపురం	విశాఖపట్నం	శ్రీశైలం
విజయనగరం	విశాఖపట్నం	శ్రీశైలం
శ్రీకాకుళం	విశాఖపట్నం	శ్రీశైలం

క్లుప్తంగా

శ్రీనివాసునికి వెండి ఆభరణాల బహూకరణ



శ్రీనివాసునికి వెండి ఆభరణాలు వేస్తున్న ఎంపీ డాక్టర్ సత్యవతి

మునగపాక: ప్రతి ఒక్కరూ దైవచింతన అలవాటు చేసుకోవాలని అనకాపల్లి ఎంపీ డాక్టర్ భీశెట్టి వెంకట సత్యవతి కోరారు. మండలంలోని వాడ్రాపల్లిలో కలియుగ దైవం వేంకటేశ్వరస్వామివారికి దాత పిల్లి సూర్యనారాయణ ఒకటిన్నర కిలో వెండితో ఆభరణాలు సమకూర్చారు. వీటిని వేద పండితుల మంత్రోచ్చరణాల మధ్య సోమవారం ఎంపీ బహూకరించారు. ఈ సందర్భంగా సత్యవతి, డాక్టర్ విష్ణుమూర్తి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ నిర్వాహకులు వారిని శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు, సచివాలయ కన్వీనర్ పెతకంశెట్టి రామజోగినాయుడు, గ్రామస్తులు మళ్ల జోగినాయుడు, దుంగా గణేష్, పిల్లి శ్రీను, దుంగా నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కేంద్ర సహాయ మంత్రి రాక నేడు

మహారాణిపేట: కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి డాక్టర్ భగవత్ కారద్ మంగళవారం విశాఖ వస్తున్నారు. హైదరాబాద్ నుంచి విమానంలో ఉదయం 7 గంటలకు విశాఖ చేరుకొని నేరుగా సర్క్యూట్ హౌస్‌కు వెళ్తారు. 10 గంటలకు పోర్టు కళావాణి స్టేడియంలో రోజ్‌గార్ మేళాలో పాల్గొంటారు. 11.30 గంటలకు హోటల్ దసపల్లాలో స్టేట్ లెవెల్ బ్యాంకర్ల సమావేశానికి హాజరవుతారు. సాయంత్రం 4.35 గంటలకు విమానంలో విజయవాడ వెళ్తారు.

అర్జీల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యం

- కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి
- కలెక్టరేట్‌లో 202 అర్జీల నమోదు



అర్జీలు పరిశీలిస్తున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, జేసీ జాహ్నవి

తుమ్మపాల: స్పందన, జగనన్నకు చెబుదాం కార్యక్రమాల్లో వచ్చిన అర్జీల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యమివ్వాలని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. మండల ప్రత్యేక అధికారులు అర్జీలను త్వరితగతిన పరిష్కరించేలా చూడాలన్నారు. ప్రతి సోమవారం జిల్లా కేంద్రంలో స్పందన కార్యక్రమానికి వచ్చే సమయంలో పూర్తి వివరాలతో రావాలన్నారు. గృహ నిర్మాణం, నాడు – నేడు, ఇంజినీరింగ్ పనులు, అంగన్‌వాడీ కేంద్రాలు, హెల్త్ క్లినిక్‌లు, వ్యర్థాల నిర్వహణ మొదలైన వాటికి ప్రాధాన్యమిచ్చి వెంటనే పనులు పూర్తయ్యేలా చూడాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ వారం మొత్తం 202 అర్జీలు నమోదయ్యాయి. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి, డీఆర్వో పి.వెంకటరమణ, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

అనధికార క్వారీలతో అనారోగ్య సమస్యలు

అనధికార క్వారీలు, బ్లాస్టింగులు తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ అనకాపల్లి మండలం రొంగలివానిపాలెం గ్రామస్తులు కలెక్టరేట్ వద్ద నిరసన చేపట్టారు. కుంచంగి, రొంగలివానిపాలెం గ్రామాల పరిధిలో క్వారీల వల్ల పలువురు కిడ్నీవ్యాధికి గురై మరణిస్తున్నారని, దీర్ఘకాల వ్యాధులతో బాధపడుతున్నారని, అధికారులు పట్టించుకోవటం లేదని, తక్షణమే క్వారీలు నిలిపివేయాలని స్పందనలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

- అనకాపల్లి మండలం కూండ్రం గ్రామంలో సీసీరోడ్డు నిర్మాణాన్ని అడ్డుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఎంపీటీసీ జెట్టి సత్యవతి సోమవారం కలెక్టరేట్ స్పందనలో ఫిర్యాదు చేశారు. తక్షణమే రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని కోరారు.
- పెట్రోలుతో నడిచే మూడు చక్రాల వాహనాన్ని మంజూరు చేయాలని దివ్యాంగుడు పి.సన్యాసిరావు స్పందనలో విన్నవించాడు.
- ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి రహదారి ఏర్పాటుతోపాటు అనధికార లేఅవుట్ వేసిన వారిపై చర్యలు తీసుకోవాలని మునగపాక మండలం ఒంపోలు గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. సదరు భూమిని స్వాధీనం చేసుకుని దళితులకు పట్టాలు మంజూరు చేయాలని కోరారు.

అర్జీదారుల సమస్యలపై స్నేహపూర్వకంగా స్పందించాలి: ఎస్పీ మురళీకృష్ణ



అర్జీదారునితో మాట్లాడుతున్న ఎస్పీ మురళీకృష్ణ

అనకాపల్లి టౌన్: అర్జీదారులతో స్నేహపూర్వకంగా మాట్లాడి, వారితో మమేకమైనప్పుడే సమస్యకు పరిష్కార మార్గం లభిస్తుందని ఎస్పీ కె.వి.మురళీకృష్ణ తెలిపారు. స్థానిక జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జిల్లాలో పలు సమస్యలతో వచ్చిన వారి నుంచి 34 అర్జీలు స్వీకరించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమాన్ని తూతూమంత్రంగా కాకుండా సమస్య పరిష్కారమే లక్ష్యంగా పని చేసినప్పుడే అర్జీదారులకు పూర్తిస్థాయిలో న్యాయం చేకూరుతుందన్నారు. వారి సమస్యను మన సమస్యగా భావించి పోలీసు అధికారులు పని చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ(పరిపాలన) బి.విజయభాస్కర్ పాల్గొన్నారు.

మాడుగుల టీడీపీలో తగ్గని ఆధిపత్య పోరు

- వేర్వేరుగా యువగళం సంఘీభావ పాదయాత్రలు
- అయోమయంలో పార్టీ శ్రేణులు



మాడుగులలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీజీ వెనుక అడుగులు వేస్తున్న అరకొరగా అభిమానులు

మాడుగుల/చీడికాడ: మాడుగుల నియోజకవర్గంలో టీడీపీ నాయకుల మధ్య అంతర్గత పోరు మరోమారు బహిర్గతమైంది. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం పాదయాత్ర వంద రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా మాడుగుల నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీజీ కుమార్ ఆధ్వర్యంలో సోమవారం చేపట్టిన సంఘీభావ పాదయాత్రకు పార్టీ శ్రేణుల నుంచి స్పందన కరువైంది. నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీజీ కుమార్ మాడుగులలోనూ, మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు చీడికాడలోనూ సంఘీభావ పాదయాత్ర నిర్వహించి తమ ఆధిపత్యం ప్రదర్శనకు పోటీపడ్డారు. మరో నాయకుడు పైలా ప్రసాదరావు ఎక్కడా కానరాలేదు. దాంతో సొంత పార్టీ కార్యకర్తలు అయోమయానికి గురయ్యారు. ఇలా ఆధిపత్య పోరుతో విడివిడిగా కార్యక్రమాలు చేపట్టడంతో పలువురు ముఖం చాటేశారు. దాంతో ఘాట్‌రోడ్ జంక్షన్ నుంచి మాడుగుల వరకు మొక్కుబడిగా పాదయాత్ర నిర్వహించి అక్కడ బస్టాండ్‌లో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. చీడికాడ మండలంలో వరహాపురం నుంచి చీడికాడ వరకు మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు ఆధ్వర్యంలో చేపట్టిన పాదయాత్రకు 200 మంది కార్యకర్తలు మాత్రమే హాజరవ్వడంతో సాదాసీదాగా సాగింది.

ఉపాధి పనులు అడ్డుకున్న ఆక్రమణదారులు



గంటావారి చెరువులో అక్రమంగా వెలసిన కమ్మలపాకలు



పని కల్పించాలని డిమాండ్ చేస్తున్న కూలీలు

- ములగపూడి చెరువులో అక్రమంగా కమ్మల పాకలు
- వాటిని తొలగించాలని వేతనదారుల డిమాండ్

నాతవరం: మండలంలోని ములగపూడిలో గంటావారి చెరువు వివాదాస్పదంగా మారింది. ఈ చెరువులో సోమవారం ఉపాధి హామీ పనులను ఆక్రమణదారులు అడ్డుకోవడంతో వేతనదారులు నిరసనకు దిగారు. వివరాల్లోకి వెళ్తే... ఆరెకరాల 12 సెంట్ల విస్తీర్ణం కలిగిన ఈ చెరువులో గ్రామానికి చెందిన 150 మందికిపైగా వేతనదారులు కొన్ని రోజులుగా ఉపాధి హామీ పనులు చేస్తున్నారు. చెరువులో ఒక భాగం స్థానిక టీడీపీ సానుభూతిపరులు ఆక్రమించుకుని కమ్మల పాకలు వేసుకున్నారు. మరో పక్క నీరు నిల్వ ఉండటంతో ఉపాధి కూలీలు పనులు చేయడానికి వీలు కాలేదు. ఈ నేపథ్యంలో చెరువు గర్భం ఆక్రమణలో పాకలు ఖాళీ చేస్తే ఉపాధి పనులు చేయడానికి బాగుంటుందని కూలీలు డిమాండ్ చేస్తున్నారు. ఎప్పటి మాదిరిగానే సోమవారం ఉపాధి పనులకు వెళ్లగా ఆక్రమణదారులు అడ్డుకున్నారు. దాంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. వేతనదారులకు సర్పంచ్ మూర్తి నాగమణి, మరి కొంతమంది గ్రామపెద్దలు మద్దతు పలికారు. ఆక్రమణదారులకు ఎంపీటీసీ సభ్యుడు తమరాన లోవకృష్ణ కొంత మంది పెద్దలు మద్దతుగా నిలిచి వాదిస్తున్నారు. ఈ వ్యవహారం అధికారులకు తలనొప్పిగా మారింది. దీనిపై ఉపాధి ఏపీవో చిన్నారావు వివరణ కోరగా, కూలీలకు మరోచోట పని కల్పిస్తే, వారు అక్కడకు వెళ్లబోమని చెరువులోనే పని చేస్తామని భీష్మించారన్నారు. చెరువులో ఆక్రమణల తొలగింపునకు స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామపెద్దలు సహకరించలేదన్నారు.

మత్తు ఇంజక్షన్లు, గంజాయి, సెల్‌ఫోన్లు స్వాధీనం : ముగ్గురి అరెస్ట్

అల్లిపురం: ఇటీవల మత్తు ఇంజక్షన్లు కలిగివున్న ముగ్గురు వ్యక్తులను టూటౌన్ పోలీసులు అదుపులోకి తీసుకున్న సంగతి తెలిసిందే. విచారణ అనంతరం వారిని సోమవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ బి.తిరుమలరావు తెలిపారు. భీమిలి, రెల్లివీధికి చెందిన కొల్లి హరిపద్మ రాఘవరెడ్డి, అల్లిపురం నేరెళ్లకోనేరు ప్రాంతానికి చెందిన పప్పొతి రవి, మర్రిపాలెం, రైల్వే క్వార్టర్స్‌కు చెందిన పాకా చిరంజీవిలు పశ్చిమ బెంగాల్‌లో నిషేధిత మత్తు ఇంజక్షన్లు (ఫోర్ట్‌విన్) తక్కువ ధరకు కొనుగోలు చేసి నగరంలో యువతకు అధిక ధరకు అమ్ముతున్నారని సమాచారం మేరకు టాస్క్‌ఫోర్సు పోలీసులు దాడులు నిర్వహించారు. వారి వద్ద నుంచి 2100 ఫోర్టువిన్ ఇంజక్షన్లు, 21 కేజీల గంజాయి, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు వారిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

మోటార్ సైకిల్‌ను ఢీకొట్టిన లారీ

- ఇద్దరికి గాయాలు

మాకవరపాలెం: మోటార్ సైకిల్‌ను ఢీకొట్టిన లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ రామకృష్ణారావు సోమవారం తెలిపారు. నర్సీపట్నం మండలం బైపురెడ్డిపాలెం గ్రామానికి చెందిన అప్పలనాయుడు, పశ్చిమ గోదావరి జిల్లా పెదపాడుకు చెందిన మనోజ్‌కుమార్ మాకవరపాలెం మండలం గిడుతూరులో ఆదివారం రాత్రి ఓ వివాహానికి వచ్చారు. తిరిగి మోటార్ సైకిల్‌పై వెళుతుండగా కొండలఅగ్రహారం వద్దకు వచ్చేసరికి ఎదురుగా వస్తున్న లారీ ఢీకొట్టడంతో వీరిద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారని, బాధితుల ఫిర్యాదు మేరకు లారీ డ్రైవర్ రాంబాబుపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

గంజాయి తరలిస్తున్న నలుగురి అరెస్టు

మాకవరపాలెం: గంజాయి తరలిస్తున్న నలుగురిని అరెస్టు చేశామని ఎస్‌ఐ రామకృష్ణారావు సోమవారం తెలిపారు. తెలంగాణకు చెందిన ఇద్దరు మైనర్లతోపాటు కిరణ్ దమాయ్(20), అల్లూరి సీతారామరాజు జిల్లా దారకొండకు చెందిన కొర్రా కల్యాణ్(28) గంజాయి తరలిస్తున్నట్టు అందిన సమాచారంతో మండలంలోని కొండలఅగ్రహారం వద్ద వాహనాల తనిఖీలు చేపట్టామన్నారు. ఈ తనిఖీల్లో ఆర్టీసీ బస్సులో వీరు తరలిస్తున్న 650 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

చిక్కడు దొరకడు షూటింగ్ ప్రారంభం



చిక్కడు దొరకడు చిత్రంలోని సన్నివేశం

మునగపాక: వర్ధమాన దర్శకుడు కోరుకొండ గోపీకృష్ణ దర్శకత్వంలో సోమవారం చిక్కడు దొరకడు చిత్రం షూటింగ్ ప్రారంభమైంది. మునగపాక శివాలయంలో కొబ్బరికాయ కొట్టి ఈ సినిమాను లాంఛనంగా ప్రారంభించారు. వీఆర్ ప్రొడక్షన్ బ్యానర్‌పై తీస్తున్న ఈ చిత్రానికి విజయలక్ష్మి రాజ్‌కిరణ్ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. రచన విల్లూరి జగ్గప్పారావు, సంగీతం ఎంఎల్ రాధ అందిస్తున్నారు. హైదరాబాద్‌కు చెందిన తారాగణంతో పాటు జబర్దస్త్ కళాకారులు ఈ చిత్రంలో నటిస్తున్నారు. జూలైలో చిత్రం విడుదలకు ఏర్పాట్లు చేస్తున్నట్లు దర్శకుడు తెలిపారు. షూటింగ్‌ను తిలకించేందుకు స్థానికులు తరలివచ్చారు. కలియుగ భగవాన్‌లో నటించిన ప్రధాన పాత్రధారి కోటేశ్వరళర్మపై పలు సన్నివేశాల చిత్రీకరించారు.

రైతుల సంక్షేమమే జగన్ లక్ష్యం

- ఎంపీ సత్యవతి, ఎమ్మెల్యే అదీప్‌రాజ్
- అట్టహాసంగా పెందుర్తి పీఏసీఎస్ చైర్మన్ ప్రమాణ స్వీకారం



శరగడం నరసింహమూర్తిని అభినందిస్తున్న ఎంపీ సత్యవతి, ఎమ్మెల్యే అదీప్‌రాజ్

సింహాచలం: రైతుల సంక్షేమమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ లక్ష్యమని ఎంపీ భీశెట్టి వెంకట సత్యవతి అన్నారు. పెందుర్తి పీఏసీఎస్ నూతన చైర్మన్‌గా వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీటీసీ శరగడం నరసింహమూర్తి ప్రమాణ స్వీకారం కార్యక్రమం సోమవారం పెందుర్తి పీఏసీఎస్ కార్యాలయంలో ఘనంగా జరిగింది. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానుల సమక్షంలో చైర్మన్ నరసింహమూర్తి, వైస్ చైర్మన్‌గా గొల్లవిల్లి భాస్కరరావు, డైరెక్టర్‌గా గోవింద్ ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంపీ సత్యవతి మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి రైతుల కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసి రైతు బాంధవుడిగా పేరుతెచ్చుకున్నారన్నారు. తండ్రి ఒక అడుగువేస్తే ఆయన తనయుడు, సీఎం వైఎస్ జగన్ రెండు అడుగులు ముందుకేసి రైతుల సంక్షేమం కోసం పనిచేస్తున్నారన్నారు. గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి అన్నదాతల చెంతకు ఎరువులు, విత్తనాలు అందుబాటులోకి తెచ్చారన్నారు. ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమం రెండు కళ్లుగా చేసుకుని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన అందిస్తున్నారన్నారు. పీఏసీఎస్ చైర్మన్ శరగడం నరసింహమూర్తి మాట్లాడుతూ తన పుట్టినరోజునాడే పీఏసీఎస్ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేయడం చాలా అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు.

లక్కవరంలో 5 పశువుల పాకలు దగ్ధం

- ప్రమాదంలో పాడిపశువు మృతి
- రూ.1.5 లక్షల ఆస్తి నష్టం



ప్రమాదంలో ఎగసిపడుతున్న మంటలు

చోడవరం రూరల్: మండలంలోని లక్కవరం గ్రామంలోని మిడతాడ వారి కళ్లాల్లో ఆదివారం అర్ధరాత్రి సంభవించిన అగ్నిప్రమాదంలో ఐదు పశువుల పాకలు, వరి గడ్డివాములు, ధాన్యం అగ్నికి ఆహుతయ్యాయి. ప్రమాదంలో చిక్కుకున్న పాడిపశువు మృతి చెందింది. ప్రమాదంలో రూ.1.5 లక్షల ఆస్తి నష్టం వాటిల్లి ఉంటుందని అంచనా. అర్ధరాత్రి 11 గంటల సమయంలో మిడతాడ వెంకటరమణ, వేచలపు సూర్యనారాయణ, మిడతాడ ముత్యాలనాయుడు, వేచలపు తాతబాబులకు చెందిన పశువుల పాకలకు నిప్పంటుకుని మంటలు ఎగిసాయి. గ్రామం నుంచి పలువురు గ్రామస్తులు చేరుకుని మంటలను అదుపు చేసే ప్రయత్నం చేశారు. ప్రమాద తీవ్రత అధికంగా కావడంతో చోడవరం అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. ఫైర్ ఆఫీసర్ పి.వి.రామస్వామి, లీడింగ్ ఫైర్‌మన్ ఎస్.ప్రసాద్ తమ సిబ్బందితో అక్కడికి చేరుకుని మంటలను అదుపు చేశారు. గ్రామ సర్పంచ్, వైఎస్సార్‌సీపీ నాయకుడు శీరంరెడ్డి వెంకటరమణ తదితరులు సహాయ సహకారం అందించారు. బాధితులను మాజీ ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్.రాజు, టీడీపీ ఇన్‌చార్జి బత్తుల తాతయ్యబాబు, మాజీ ఎంపీపీ గూనూరు వెంకట సత్యనారాయణ, మాజీ సర్పంచ్ కర్రి కోటేశ్వరరావు సోమవారం ఉదయం పరామర్శించారు.

గృహస్థాశ్రమ ధర్మం పాటించాల్సిందే

- బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు



అధ్యాత్మిక ప్రసంగం చేస్తున్న చాగంటి

మహారాణిపేట : గృహస్థాశ్రమ వైభవం ఎంతో విశేషమైనదని, గృహస్థాశ్రమంలో ఉండే ప్రతివారూ ధర్మాలను పాటించాల్సిన అవసరం ఉందని బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు అన్నారు. సిరిపురం గురజాడ కళాక్షేత్రంలో సోమవారం ధర్మవర్ధిని ట్రస్ట్ ఆధ్వర్యంలో గృహ స్థాశ్రమ వైభవం అనే అంశంపై బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావుతో ప్రవచనాలు అందరినీ ఆలోజింపజేశాయి. విజ్ఞానాన్ని పంచాయి. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ గృహస్థాశ్రమ ధర్మానికి ఎంతో ప్రాముఖ్యత ఉందని, కనుక గృహస్థాశ్రమంలో ఉన్న వారు నియమాలు, కట్టుబాట్లు, ఆచార వ్యవహారాలు, ధర్మాలను తప్పనిసరిగా పాటించాలన్నారు. మనుష్య జన్మను పొందిన ప్రతి ఒక్కరూ పితృరుణం, మాతృరుణం, రుషిరుణం, దైవరుణం తప్పనిసరిగా తీర్చుకోవాలని హితవు పలికారు. గృహస్థాశ్రమంలో పెద్దవాళ్ల దగ్గర నుంచి పిల్లల వరకు కుటుంబ సభ్యులందరూ అరమరికలు లేకుండా జీవించగలిగినప్పుడే పరిపూర్ణమైన ఆనందాన్ని పొందగలుగుతారని తెలిపారు. గృహస్థాశ్రమంలో భార్యకు ఎంతో పరమ పవిత్రమైన స్థానం ఉందని, భార్య లేకుండా భర్త ఏ సత్కర్మ చేసిన సత్ఫలితం ఉండదన్న విషయాన్ని ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. వివాహమంటే సంసారం కోసం కాదని భార్యాభర్తల అన్యోన్యతకు, ఆదర్శానికి చిహ్నమని తెలిపారు. భార్య భర్త కలసి సనాతన సంప్రదాయాలను అనుసరిస్తూ ఇంట్లో పెద్దవాళ్ల ఆశీసులు పొందుతూ జీవించాలన్నారు. అలా జీవించినప్పుడే ఆ దాంపత్యానికి చక్కని విలువ ఉంటుందని, అందరూ దీనిని గుర్తించాలని కోరారు. కార్యక్రమంలో బ్రహ్మశ్రీ కోటేశ్వరరావు ధర్మపత్ని చాగంటి సుబ్రహ్మణ్యేశ్వరి, మాజీ ఎమ్మెల్సీ పీవీఎస్ మాధవ్, అన్నంరాజు రమాదేవి నారాయణ దంపతులు, ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్, ధర్మ వర్ధిని ట్రస్టు సభ్యులు చాగంటి చరణ్, చాగంటి సత్సంగ, సభ్యులు సూర్యారావు, నారాయణ, ఎంవీఎస్ఎస్ మూర్తి , భక్తులు పాల్గొన్నారు.

జన జాతర





మోదమ్మ ఉత్సవాలతో మైదానంలోని జాయింట్ వీల్.ఇతర వినోద కార్యక్రమాల దృశ్యం, (ఇన్‌సెట్) ఆకట్టుకున్న పులివేషాలు

- ఉత్సవంలో రెండో రోజు మోదమ్మ దర్శనానికి పోటెత్తిన భక్తులు
- ఘనంగా పూజలు
- ఆకట్టుకున్న పులివేషాలు

సాక్షి,పాడేరు: అమ్మ దర్శనానికి భక్తులు పోటెత్తారు. పరుగుపరుగున ఆలయానికి చేరుకుని దేదీప్యమైన మోదమ్మ రూపాన్ని కనులారా వీక్షించి పరవశించిపోయారు...కాపాడమ్మా అంటూ ఆర్తిగా వేడుకున్నారు. తమ పిల్లాపాపలను చల్లగా చూడాలని కోరుకున్నారు. పాడేరు మోదకొండమ్మ ఉత్సవాల్లో రెండో రోజు సోమవారం అమ్మవారి దర్శనానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. తెలుగు రాష్ట్రాలతో పాటు పలు రాష్ట్రాలకు చెందిన భక్తులు పాడేరుకు చేరుకుని మోదకొండమ్మతల్లిని దర్శించుకుని, మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా పోలీసు అధికారులు భారీ బందోబస్తు నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షురాలు,పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో ఆలయ కమిటీ ప్రతినిధులు భక్తులకు అన్ని సౌకర్యాలను కల్పించారు.

ఘనంగా ఘటాల ఊరేగింపు

పాడేరు మెయిన్‌రోడ్డులోని సతకంపట్టు వద్ద కొలువుదీర్చిన మోదకొండమ్మతల్లి ఉత్సవ విగ్రహం, పాదాలు,ఇతర ఘటాలకు భక్తులు రెండవ రోజు ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవ కమిటీ అధ్యక్షుడు వర్తన పిన్నయ్యదొర,ఇతర కమిటీ ప్రతినిధులు,భక్తులు అమ్మవారి ఘటాలను పాడేరు వీధుల్లో ఊరేగించారు.డప్పు వాయిద్యాలతో పాటు గరగల నృత్యాలు,పులివేషాలతో ఘటాల ఊరేగింపు సంబరం రాత్రి 8గంటల వరకు జరిగింది.ఈ సందర్భంగా ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, పులివేషాలు ఆకట్టుకున్నాయి.



మోదమ్మకు సారె,పూజాసామగ్రిని సమర్పిస్తున్న విశ్వబ్రాహ్మణులు కుటుంబాలు



సతకంపట్టు నుంచి ఘటాలను మోస్తున్న ఉత్సవ కమిటీ అధ్యక్షుడు పిన్నయ్యదొర, భక్తులు

మోదమ్మకు సారె

సాక్షి,పాడేరు: మోదకొండమ్మతల్లికి పట్టణంలోని విశ్వబ్రాహ్మణ కుటుంబాల వారు సోమవారం సారె, పసుపు,కుంకుమలు సమర్పించారు. మోదకొండమ్మతల్లి ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కొట్టగుళ్లి సింహాచలంనాయుడు,ప్రతినిధి ఉప్పల రత్నం,వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ ధర్మకర్త నవర గోవిందరావు,విశ్వబ్రాహ్మణ సంఘం పట్టణ అధ్యక్షుడు వెంకటరమణ,సంఘ ప్రతినిధి నానాజీ తదితరులు పాల్గొన్నారు.

వినోదాల సందడి

సాక్షి,పాడేరు: మోదకొండమ్మతల్లి ఉత్సవాలతో వినోదాల సందడి నెలకొంది. స్థానిక జూనియర్ కళాశాల మైదానంలో ఎగ్జిబిషన్.. జాతరకు వచ్చిన అన్ని వర్గాల భక్తులను అలరిస్తోంది. ఐటీడీఏ ఆధ్వర్యంలో పలు ప్రభుత్వ శాఖలు ఏర్పాటు చేసిన స్టాళ్లను పలువురు ఆసక్తిగా తిలకించారు. డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్‌బాషా,ఇతర వైద్య సిబ్బంది ఈస్టాల్‌లో భక్తులకు వైద్య సేవలు అందజేశారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate

HOUSE FOR SALE
- అమ్మతాపురం SEZ పూడిమడకరోడ్డు ఫేసింగ్ శ్రీపురం గార్డెన్స్‌లో 167 చ॥గ॥ 2 B/R డీలక్స్ 1400 చ॥గ॥ల్లో అన్ని డెవలప్‌మెంట్స్ పూర్తి చేసుకొని కలదు. ఫోన్: 88229 09999 [V-2782]

SITE FOR SALE
- ఆనందపురం మండలం కుసిలివాడలో VMRDA Approved, నార్త్ ఫేస్ లే అవుట్‌ను ఆనుకొని 1645 చ॥గ॥లు సైటు అమ్మకమునకు కలదు. గజం రేటు 8000/-. ఫోన్: 99666 11183 [V-1883]

Services

GOLD LOANS
- లోకేష్ గోల్డ్ లోన్స్ :- బ్యాంక్/ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి అదే రోజు మార్కెట్ రేటుకు కొనబడును. సంప్ర :- 98484 88068/ 77992 23300 [V- 10536]

OLD AGE HOME
- వృద్ధుల ఆశ్రమం, పెద్దల ఆసుపత్రి, వైద్యసేవలు, ఫిజియోథెరపీ మరియు మీ ఇంటివద్దకే సేవలు. మురళీనగర్. సెల్: 96404 28395 [V- 794520]

Wanted
- సంపన్నుల ఇళ్ల వద్దే ఉంటూ వృద్ధులను, బెడ్ పేషెంట్స్‌ను చూసుకొనుటకు M/F కేర్ టేకర్స్, ఆయాలు, నర్సులు కావలెను. శాలరీ:14-20K, వసతి + భోజనం, VJA ✆ 94942 25282, 72070 72559 [B-085]
- మా కంపెనీ LED బల్బులు మీ ఇంటివద్దనే ఉండి ఫిట్‌చేసి ఇవ్వడం ద్వారా నెలకి 15,000- 20,000/- వరకు సంపాదించండి. వివరాలకై సంప్ర: 7989951063 [G-786313]
- పనిమనిషి కావలెను : చినవాల్తేర్ (కొటక్ స్కూల్ ప్రక్కన) గల ఇంట్లో పనిచేయుటకు (ఫుల్ / పార్ట్ టైం) 30సం॥లు లోపు ఆడ మనిషి కావలెను. ఫోన్ : 79897 12898 [V-10570]
- రెడీమేడ్ షాపులో పనిచేయుటకు అనుభవం గల సూపర్‌వైజర్స్, సేల్స్ పర్సన్స్ (M/F) కావలెను. పవన్, 5వ లైన్, ద్వారకానగర్, వైజాగ్-16, సంప్ర॥ 94408 02452, 94408 02456 [V-920]
- హోటల్ ఫీల్డ్‌లో అనుభవం గల వారు కావలెను. 1) హౌస్ కీపింగ్ కొరకు : శాలరీ : 13,000/- (Inclu. ESI, P.F). 2) సూపర్‌వైజర్స్ : శాలరీ : 18,000/- (Inclu. ESI, P.F), ఉచిత వసతి + భోజనం. 3) సెక్యూరిటీ గార్డ్స్ : 18,000/- డ్యూటీ : 12 గం॥లు. ఫోన్: 91001 03011, 93099 87957 [V-1881]
- SBI Life లో అడ్వైజర్ / సేల్స్ మేనేజర్‌గా చేయుటకు M/F కావలెను. Qlf : 10th - డిగ్రీ & Govt. & Pvt., Rtd., ఎంప్లాయిస్, బిజినెస్ పర్సన్స్, హౌస్ వైఫ్స్, Ex. సర్వీస్ మెన్స్ సంప్ర. PM : 30k - 50k. ఫోన్ : 90522 16662 [V-1886]
- OPDSS సెక్యూరిటీ సంస్థనందు ఆంధ్ర యూనివర్సిటీ పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. ఆకర్షణీయమైన జీతం, మరియు ESI, P.F, కలదు. ఫోన్ : 79811 56210, 99635 58570 [V-1880]
- ప్రముఖ ప్రభుత్వ మరియు ప్రైవేటు విద్యా సంస్థల్లో డ్రిల్ టీచర్లుగా పనిచేయుటకు యువతి, యువకులు కావలెను. అర్హత: ఇంటర్, జీతం: 15వేలు, స్పాట్ జాయినింగ్. 7993680951 [G-576]
- పశ్చిమగోదావరి జిల్లా, పాలకొల్లు క్రీమ్ సిటీ నందు పనిచేయడానికి యువకులు కావలెను. జీతం+ఉచిత భోజనం+టిఫిన్+ రూమ్ వసతి కలదు. సంప్ర: Ph: 9490165188 [HA-173]
- Wanted Chief Beuros, Video Editor, Anchors (M/F), News Readers, Script Writers, Camera Men's,Reporters, Crime Reports, Mktg Exe For News Channel. 9951447284, 8247597398 [HA-10780]
- హరేకృష్ణ హోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి+భోజనం, జీ: 16K-18K విజయవాడ. ఫోన్: 9640528899, 9640648899 [HA-157]

రియల్టీ సమాచారం కొరకు లాగాన్ కండి www.sakshi.com

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

సాక్షి క్లాసిఫైడ్స్ లలితానగర్, అక్కయ్యపాలెం, విశాఖపట్నం - 16.
మీ ప్రాంతంలోని మా ప్రతినిధులను సంప్రదించండి
అనకాపల్లి : 9010546644
యలమంచిలి : 9951602901
చోడవరం : 9010210265
నర్సీపట్నం : 9010234557
పాడేరు : 9010973030
విశాఖపట్నం, అనకాపల్లి + అల్లూరి జిల్లా
నాలుగు లైన్లు రూ.475/-
అదనపు లైను రూ.100/-
+ 5% జి.ఎస్.టి. అదనం

క్లుప్తంగా

సత్యనారాయణస్వామి భూముల కౌలు వేలం రేపు

అనకాపల్లిటౌన్ : స్థానిక సుంకరమెట్ట సత్యనారాయణస్వామి వారి దేవాలయం హక్కుభుక్తంలో భాగంగా ఈ నెల 17న ఆలయ ఆవరణలో బహిరంగ వేలంపాట నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో కె.ఆదినారాయణ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. సర్వే నెం.1616/1లో 2.38 ఎకరాలు, సర్వే నెం .1662/2సీలో 58 సెంట్లు, సర్వే నెం .1662/2బీలో 56 సెంట్లును ఈ ఏడాది జూన్ 1 నుంచి 2026 మే 31 వరకు మూడేళ్లు కౌలుకు ఇచ్చేందుకు నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల వారు ధరావతు చెల్లించి పాటలో పాల్గొనవచ్చన్నారు. హెచ్చు పాటదారు శిస్తు ముందస్తుగా చెల్లించాలని కౌలు ఖరారు చేసుకోవచ్చన్నారు. పాటదారులు ఆధార్ కార్డు, రూ.లక్ష సాల్వెన్సీ సర్టిఫికెట్‌ను ఆలయ అధికారులకు సమర్పించాల్సి ఉంటుందని వెల్లడించారు.

త్రిపురాంతక స్వామికి ప్రత్యేక పూజలు

కశింకోట : స్థానిక సర్వమంగళాంబ సమేత త్రిపురాంతకస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అర్చకులు వి.శంకరం, వి.చిదంబరం, వి.కృష్ణ ఆధ్వర్యంలో జరిగిన పూజా కార్యక్రమాల్లో భక్తులు ఎక్కువగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా దాతల సహకారంతో మధ్యాహ్నం అన్న సమారాధన నిర్వహించారు.

6 నుంచి మహిళలకు ఎంబ్రాయిడరీ, మగ్గంపై శిక్షణ

అనకాపల్లిటౌన్ : భారతీయ స్టేట్ బ్యాంకు, గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో జూన్ 6 నుంచి గ్రామీణ ప్రాంత మహిళలకు ఎంబ్రాయిడరీ, మగ్గం వర్క్‌పై ఉచిత శిక్షణ తరగతులు ప్రారంభించనున్నట్లు సంస్థ డైరెక్టర్ బి.విజయ్‌కుమార్ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. శిక్షణా కాలంలో మహిళలకు ఉచిత వసతి, భోజన సదుపాయాలు కల్పించనున్నట్లు తెలిపారు. శిక్షణ పూర్తి చేసిన అభ్యర్థులకు బ్యాంకుల ద్వారా రుణ సౌకర్యం అందిస్తామన్నారు. 18 ఏళ్ల నిండి 45 ఏళ్లలోపు వయసుండి, తెల్లరేషన్‌కార్డు కలిగిన వారు అర్హులని తెలిపారు. మరిన్ని వివరాలకు 8008333509 నంబర్లో సంప్రదించవచ్చన్నారు.

19న చంద్రబాబు రాక

అనకాపల్లి టౌన్ : మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పర్యటనను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో సోమవారం జరిగిన టీడీపీ విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 19న చంద్రబాబు అనకాపల్లిలో పర్యటిస్తారని ఆయన వెల్లడించారు. ఈ సందర్భంగా పర్యటన ఏర్పాట్లను సమీక్షించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగజగదీశ్వరరావు, టీడీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు సోమవారం 273 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,230	4,970
రెండో రకం	4,000	4,200
మూడోరకం	3,560	3,960

అనకాపల్లి సినిమాలు

కస్టడీ	:	రాజా
రామబాణం	:	సత్యనారాయణ-1
ఫర్హానా	:	సత్యనారాయణస్క్రీన్-2
ది కేరళ స్టోరీ	:	షిర్డీసాయి
విరూపాక్ష	:	పర్తిసాయి
కథ వెనుక కథ	:	వెంకటేశ్వర
ఉగ్రం	:	శ్రీసత్య
ఏజెంట్	:	రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్ : జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 119 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-7 యూనిట్లు, బీ పాజిటివ్-39 యూనిట్లు, ఓ పాజిటివ్-73 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయ బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్య(9848418400)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్ : ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా సోమవారం 317 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 313 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(9441108144)ని సంప్రదించవచ్చు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
9966329167, 9912440601
సాక్షి

తాటి ముంజలు.. మది దూదిపింజెలు

వేసవిలో మాత్రమే దొరికే సీజనల్ ఫుడ్‌లో తాటి ముంజలు కూడా ఒకటి. ఇవి చూడటానికి జెల్లీలా, పట్టుకుంటే జారిపోయేంత మృదువుగా ఉంటాయి. నోట్లో వేసుకుంటే తియ్యగా, కరిగిపోయేలా ఉండే వీటిలోని నీరు అమృతమేనంటే అతిశయోక్తి కాదేమో. ఇవి శరీరానికి కలిగించే చలువ వల్ల దీన్ని 'ఐస్ యాపిల్'అని కూడా అంటారు. ఎండాకాలం ప్రారంభం నుంచే మార్కెట్లో దర్శనమిచ్చే తాటి ముంజలు, ఇపుడు ఎక్కడ చూసినా విరివిగా కనిపించి నోరూరిస్తున్నాయి.



అనకాపల్లి తహసీల్దార్ కార్యాలయం సమీపంలో తాటి ముంజల విక్రయాలు, (ఇన్‌సెట్) అమ్మకానికి తాజా తాటి ముంజలు

- నోరూరిస్తున్న తాటి ముంజలు
- పట్టణాల్లో జోరుగా విక్రయాలు
- వేసవి తాపాన్ని తగ్గించే ముంజలు

అనకాపల్లి రూరల్ : మండే ఎండల్లో లేత తాటి ముంజల రుచి ఎంత అద్భుతంగా ఉంటుందో ప్రత్యేకించి చెప్పాలా? అందుకే వేసవి వచ్చిందంటే చాలు తాటి ముంజలకు మంచి డిమాండ్. పట్టణాల్లో ముంజల విక్రయాలు జోరందుకున్నాయి. వేసవి తాపం ఉపశమనానికి శీతల పానీయాలకు బదులుగా తాటి ముంజలకే జనాలు ప్రాధాన్యత ఇస్తున్నారు. అనకాపల్లి పట్టణంలో ఎక్కడ చూసినా తాటి ముంజల విక్రయాలు కన్పిస్తున్నాయి. హైవేతో పాటు పట్టణానికి ఉన్న అన్ని ప్రధాన దారుల్లో ముంజల్ని తినేందుకు చిన్నపెద్ద తేడా లేకుండా ఎగబడుతున్నారు.

వేసవిలో ఉపశమనం

వేసవిలో విరివిగా లభించే తాటి ముంజల్ని తింటే వేసవి తాపాన్ని తగ్గించడంతోపాటు పోషక విలువలు కూడా శరీరానికి అందిస్తాయి. ఏప్రిల్‌లో ప్రారంభమైన ముంజల సీజన్ మే నెలాఖరు వరకు ఉంటుంది. సీజన్‌లో మాత్రమే దొరికేవి కావడంతో వీటికి డిమాండ్ ఏర్పడింది. ముంజలో 87 శాతం నీరే ఉండటంతో శరీరంలో ఉష్ణోగ్రత తగ్గి, జీవక్రియ మెరుగుపడుతుంది. బరువు తగ్గడంలో కూడా ఇది బాగా పనిచేస్తుందని పోషకాహార నిపుణులు చెప్తారు.

పోషక విలువలు ఎక్కువే..

తాటి ముంజల్లో విటమిన్-ఏ సమృద్ధిగా లభిస్తుంది. దీంతో పాటు థయామిన్, నియాసిన్ వంటివి శరీరానికి పుష్కలంగా సమకూరుతాయి. ఖనిజ లవణాలు, యాంటీ ఆక్సిడెంట్లు ఎక్కువ మొత్తంలో ఉంటాయి. యాంటీ ఇన్‌ఫ్లమేటర్ లక్షణాలు కలిగి వాపును తగ్గిస్తాయి. ఇవి తింటే ఆకలి పెరుగుతుంది. చిన్నారులు, వృద్ధులకు, గుండెజబ్బులు, చక్కెర వ్యాధిగ్రస్తులకు ముంజలు ఎంతో మేలు చేస్తాయి. పీచు పదార్థం కావడంతో మలబద్ధకం నివారిస్తుంది. రోడ్డుపై విక్రయించే మామిడి, ద్రాక్ష, అరటి, నారింజ, బొప్పాయి, ఆపిల్ ఇలా ఏ పండ్లు కొనాలన్నా రసాయనాల ప్రభావం ఉంటుంది. ఎలాంటి రసాయనాల ప్రభావం లేకుండా లభించే స్వచ్ఛమైనవి ముంజలు కావడంతో వీటిని తినేందుకు ఆసక్తి చూపుతున్నట్టు పలువురు చెప్తున్నారు.

గిరాకీతో పెరిగిన ధర

ప్రస్తుతం రహదారులకు ఇరువైపులా విక్రయిస్తున్న తాటి ముంజల ధర కూడా ఎక్కువగానే ఉంటోంది. కొందరు తాటి చెట్లను కొనుగోలు చేసి వాటి నుంచి కాయలను దించి రోడ్లకిరువైపులా విక్రయిస్తున్నారు. డజను ముంజల ధర రూ.40 చెప్తున్నారు. బేరమాడుకుని కొనుక్కోవాల్సిందే. ప్రస్తుతం ముంజలకు మంచి గిరాకీ ఉండటంతో అనకాపల్లి జిల్లా కేంద్రంలో ముంజల అమ్మకాలపై గీత కార్మికులే కాకుండా, కొందరు యువకులు కూడా ఆధారపడి విక్రయాలు చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి తాటి కాయలను బస్తాల్లో సమీప పట్టణాలకు తరలించి అమ్ముతున్నారు.

అమ్మకాలు బాగున్నాయి



ఈ సీజన్‌లో తాటి ముంజల అమ్మకాలు బాగున్నాయి. ఏప్రిల్ నెలారంభం నుంచి మొదలైన ముంజల అమ్మకాలు మే నెలాఖరు వరకు ఉంటాయి. వేసవి తీవ్రత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో తాటి ముంజలకు బాగా డిమాండ్ ఏర్పడింది. మధ్యాహ్నానికే ముంజల అమ్మకాలు పూర్తవుతున్నాయి. యేటా ముంజల అమ్మకాల ద్వారా వేసవిలో దాదాపు రెండు నుంచి మూడు నెలలు జీవనోపాధిని పొందుతున్నాం.

– ముంత నాయుడు, గీత కార్మికుడు,యలమంచిలి

మెనూ పక్కాగా అమలు చేయాలి



అంగన్‌వాడీ కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీపీ గొర్లి సూరిబాబు, ఎంపీడీవో ధర్మారావు



కోడిగుడ్లు తనిఖీ చేస్తున్న ఎంపీపీ, ఎంపీడీవో

- బవులవాడ అంగన్‌వాడీ కేంద్రంలో ఎంపీపీ, ఎంపీడీవో తనిఖీ

అనకాపల్లి రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలకు నిర్దేశించిన పోషకాహార మెనూ ఖచ్చితంగా అమలు చేయాలని అనకాపల్లి ఎంపీపీ గొర్లి సూరిబాబు, ఎంపీడీవో కె.ధర్మారావు స్పష్టం చేశారు. సోమవారం మండలంలోని బవులవాడ అంగన్‌వాడీ కేంద్రంలో అధికారుల బృందం ఆకస్మిక తనిఖీ చేపట్టింది. ఈ సందర్భంగా ఇక్కడ అమలవుతున్న మెనూను పరిశీలించారు. చిన్నారులకు పెడుతున్న భోజనం రుచి చూశారు. కేంద్రంలో నిల్వ ఉంచిన కోడిగుడ్ల స్టాక్‌ను పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని నిర్వాహకులకు సూచించారు. తనిఖీల్లో గుర్తించిన లోపాలను తెలుపుతూ, పునరావృతం కాకుండా చూసుకోవాలని హెచ్చరించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు ఇకపై తరచుగా తమ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేసి నిర్వహణ లోపాలను ఎప్పటికప్పుడు సరిచేయాలని సూచించారు. వీరి వెంట ఏపీడీపీవో శశికళ, ఎంపీటీసీ తోటాడ విజయ్, వెంకట్రావు, బవులవాడ గ్రామ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు దాడి కుమార్, ఉడత వెంకట రమణ, శ్రీను, కన్నారావు పాల్గొన్నారు.

'ట్రాఫిక్ నిబంధనలు పాటించండి'



డ్రైవర్లతో మాట్లాడుతున్న సీఐ శ్రీను

అనకాపల్లిటౌన్ : రహదారులపై రోడ్డు ప్రమాదాల నియంత్రణకు వాహన డ్రైవర్లు ప్రభుత్వానికి, పోలీస్‌శాఖకు సహకరించాలని ట్రాఫిక్ సీఐ టి.శ్రీను కోరారు. స్థానిక రావుగోపాలరావు కళాక్షేత్రం సమీపంలో వ్యాన్, ఆటో డ్రైవర్లతో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పరిమితికి మించి వాహనాల్లో లోడ్ తీసుకెళ్లడం, వాహనాలను అతివేగంగా నడపడం వల్లే రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని పేర్కొన్నారు. నిబంధనల మేరకు డ్రైవింగ్ లైసెన్స్‌లు ఉన్న వ్యక్తులు మాత్రమే వాహనాలు నడపాలని ఆయన సూచించారు. పట్టణ పరిధిలో వాహనాలు నడిపేటపుడు పాదచారులు, వృద్ధులు, పిల్లలు, చిన్నవాహనాలపై దృష్టి సారించి డ్రైవింగ్ చేయాలని తెలిపారు. సెల్‌ఫోన్ డ్రైవింగ్ ప్రమాదకరమన్నారు. డ్రైవర్లు యూనిఫాం తప్పనిసరిగా ధరించాలని పేర్కొన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించి, తమకు సహకరించాల్సిందిగా సూచించారు.

ఏఎంఏ పాలిటెక్నిక్ కళాశాల కొత్త కార్యవర్గం



అనకాపల్లి రూరల్ : స్థానిక అనకాపల్లి వర్తక సంఘం కొణతాల సుబ్రహ్మణ్యం, ఇమ్మిడిశెట్టి కనకరాజు పాలిటెక్నిక్ కళాశాల నూతన కార్యవర్గం సోమవారం ఏర్పాటైంది. ఇటీవల కళాశాలకు కొత్త కార్యవర్గాన్ని నియమిస్తూ వర్తక సంఘం పాలకవర్గం తీర్మానించింది. ఈ మేరకు సోమవారం పాలిటెక్నిక్ కళాశాల కొత్త గవర్నింగ్ బాడీ కొలువుదీరింది. కళాశాల గవర్నింగ్ బాడీ మీటింగ్ హాల్లో ప్రమాణస్వీకార కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల నూతన కార్యవర్గం అధ్యక్షునిగా కొణతాల బాల సుబ్రహ్మణ్యం, కరస్పాండెంట్‌గా ఏఆర్ఎల్ నర్సింగరావు, కోశాధికారిగా కేవీఎస్ఆర్‌కే అచ్యుత రామయ్య, ఎక్స్ అఫీషియో సభ్యులుగా కొణతాల లక్ష్మీనారాయణరావు(పెదబాబు), తమ్మన రఘుబాబు, సభ్యులుగా మళ్ల సూర్యప్రకాశరావు(సురేష్), పెంటకోట బాలకృష్ణ, కాండ్రేగుల రవీంద్రనాథ్, కేపీకే అప్పలరాజు, బొండాడ రాజేష్, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వసంత రాజేంద్ర ప్రసాద్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. నూతన సభ్యులకు కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, పలువురు వర్తకసంఘం ప్రతినిధులు అభినందనలు తెలిపారు. కార్యక్రమానికి పెంటకోట వెంకట రామారావు(శ్రీను), ధరాల కృష్ణ పేర్రాజు ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరయ్యారు.

'ల్యాండ్ పూలింగ్ బాధితులకు న్యాయం చేయాలి'

అనకాపల్లి రూరల్ : మండలంలోని ల్యాండ్ పూలింగ్ బాధితులకు వెంటనే న్యాయం చేయాలని కోరుతూ సోమవారం అఖిలపక్ష నేతలు ఆందోళన చేశారు. ప్రభుత్వం ల్యాండ్ పూలింగ్‌లో భాగంగా భూములు తీసుకుని ప్రత్యామ్నాయ భూమిని ఇంకా ఇవ్వకపోవడం ఆక్షేపణీయమన్నారు. గతంలో పలుమార్లు నిరసన తెలిపి, సంబంధిత అధికారులకు వినతి పత్రాలు ఇచ్చినా స్పందించలేదన్నారు. తక్షణమే ల్యాండ్ పూలింగ్ బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్డీవో కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం ఇచ్చారు. సీపీఐఎంఎల్ లిబరేషన్ పార్టీ జిల్లా కన్వీనర్ పీఎస్ అజయ్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ నేత ఐఆర్ గంగాధర్, ఏపీ కౌలురైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎ.బాలకృష్ణ, సీపీఐ అనకాపల్లి జోనల్ కార్యదర్శి వై భద్రం, ఆప్ నేత హరినాథ్ బాబు, దాసరి సంతోష్ కుమార్, ఈరుగుల శంకర్రావు, ఈరుగుల రమణమ్మ, ఈరుగుల దుర్గా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ ఉండని ప్రాంతాలు

అనకాపల్లిటౌన్ : జంగిల్ క్లియరెన్స్‌లో భాగంగా ఈ నెల 17న పట్టణంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు విద్యుత్‌శాఖ అనకాపల్లి డివిజన్ ఏఈ కె.రాజశేఖర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గొల్లవీధి, లక్ష్మీనారాయణనగర్, నాయీబ్రాహ్మణవీధి, జంపావారివీధి, పిళ్లావారివీధి, పెరుగుబజారు కూడలి, శ్రీ చైతన్య స్కూల్ పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్‌కు అంతరాయం ఏర్పడుతుందన్నారు. ఆయా ప్రాంతాల వారు ఈ అసౌకర్యాన్ని గమనించి తమ సిబ్బందికి సహకరించాల్సిందిగా కోరారు.

'స్టాంప్ పేపర్ల సరఫరా పెంచాలి'

అనకాపల్లిటౌన్ : స్థానిక సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలో స్టాంప్‌పేపర్ల కొరత నివారణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జి సూదికొండ మాణిక్యాలరావు సోమవారం మీడియాకు తెలిపారు. స్టాంప్ పేపర్ల కొరత కారణంగా స్థిరాస్తుల క్రయ విక్రయదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. కార్యాలయం దగ్గరలో ఉన్న స్టాంప్ వెండర్ల వద్ద రూ.100, రూ.50 స్టాంప్ పేపర్ల కోసం ఎంతో సమయం క్యూలైన్‌లో నిలబడి కొనుగోలు చేయాల్సి వస్తోందన్నారు. సంబంధిత శాఖాధికారులు దీనిపై దృష్టి సారించి, స్టాంప్ పేపర్ల సరఫరాను పెంచాలని కోరారు.

యోగాతో మానసిక ప్రశాంతత



స్విమ్మింగ్‌పూల్లో ఆసనాలు వేస్తున్న సత్యనారాయణ, క్లబ్, సమితి సభ్యులు

అనకాపల్లిటౌన్ : యోగాతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని వైద్యులు గండి వెంకట సత్యనారాయణ అన్నారు. స్థానిక శారదానది ఒడ్డున స్విమ్మింగ్‌పూల్ వద్ద జార్జిక్లబ్ యోగా సమితి ఆధ్వర్యంలో సోమవారం యోగాసనాల కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసనాలతో పాటు, ఈత వలన వ్యాయామం చేసినట్లవుతుందన్నారు. ప్రతిరోజు నడక, వ్యాయామం, యోగాకు కొంత సమయం కేటాయించాలన్నారు. యోగాసనాల ద్వారా పలు వ్యాధులను దూరం చేయవచ్చన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతి ఒక్కరినీ దీర్ఘకాలిక వ్యాధులు పీడిస్తున్నాయని, వాటిని దూరం చేసేందుకు యోగా ఎంతగానో దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో భారత స్వాభిమాన్ ట్రస్టు, పతంజలి యోగా సమితి జిల్లా అధ్యక్షుడు భీశెట్టి దొరమనాయుడు, యోగా గురువు ఎం.జనార్దన్, క్లబ్ సభ్యులు, యోగా సమితి సభ్యులు పాల్గొన్నారు.


సీపీడీడబ్ల్యూఏ నూతన కార్యవర్గం



కొత్తగా ఎన్నికైన నూతన కార్యవర్గం

అనకాపల్లిటౌన్ : కన్స్యూమర్స్ ప్రొడక్ట్స్ డిస్ట్రిబ్యూటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్(సీపీడీడబ్ల్యూఏ) అధ్యక్షునిగా పీఎస్ఎస్ఎన్ జోసెఫ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక వైఎంవీఏ హాల్లో సోమవారం జరిగిన ఎన్నికల్లో కార్యదర్శిగా నాగు, కోశాధికారిగా ఎం.మల్లేశ్వరరావుతోపాటు ఆరుగురు సభ్యులు ఎన్నికయ్యారు. వీరి పదవీకాలం 2025 మార్చి వరకు కొనసాగనుంది. ఎన్నికల అధికారులుగా కోలాటి చిదంబరం, వినకోట బుచ్చిరాజు, పేర్రాజు, వెలగా కాశీపతిలు వ్యవహరించారు.

నూకాంబిక సన్నిధిలో 'గొట్టుముక్కల'



ఆశీస్సులందుకుంటున్న ఉపమాక ప్రధాన అర్చకులు ప్రసాదాచార్యులు

అనకాపల్లి రూరల్ : ఉత్తరాంధ్ర భక్తుల ఇలవేల్పు అనకాపల్లి నూకాంబిక అమ్మవారిని సోమవారం రాత్రి ఉపమాక వెంకన్న ఆలయ ప్రధాన అర్చకులు గొట్టిముక్కల ప్రసాదాచార్యులు దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఆయనకు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. అమ్మవారికి సాయంత్రం ప్రత్యేక హారతులిచ్చే సమయంలో దర్శించుకునే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నట్టు ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ఆలయ అర్చకులు అమ్మవారికి శ్రీ సూక్తం, ధూప దీప నీరాజనం మంత్రపుష్పాలు సమర్పించారు. అనంతరం అమ్మవారి శేష వస్త్రంతో ప్రసాదాచార్యులను సత్కరించి తీర్థప్రసాదాలను అందించారు. ఆయన వెంట ఉపమాక శివాలయం కమిటీ చైర్మన్ చెరుకూరి వెంకటేశ్వరరావు, డీవీఎస్ రావు, కొప్పిశెట్టి హరిబాబు, గోర్స శ్రీనివాసరావు, గురు భవానీ రాంబాబు అమ్మవారిని దర్శించుకున్నారు.

ముగిసిన గౌరీపరమేశ్వరుల ఆలయ వార్షికోత్సవం



గౌరీపరమేశ్వరులసన్నిధిలో మందపాటి జానకీరామరాజు, జాజుల రమేష్, పార్టీ శ్రేణులు



అన్నసమారాధనను ప్రారంభిస్తున్న దాడి రత్నాకర్

అనకాపల్లిటౌన్ : గత రెండు రోజులుగా జరుగుతున్న స్థానిక వేల్పులవీధి గౌరీపరమేశ్వరుల ఆలయ ప్రథమ వార్షికోత్సవ కార్యక్రమాలు సోమవారంతో ఘనంగా ముగిశాయి. గౌరీపరమేశ్వరులను భక్తులు అధికసంఖ్యలో దర్శించుకున్నారు. వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీ రామరాజు, యువజన విభాగం అధ్యక్షుడు జాజుల రమేష్, నియోజకవర్గ పార్లమెంట్ పరిశీలకులు దాడి రత్నాకర్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం ఆలయం వద్ద ఏర్పాటు చేసిన అన్నసమారాధనను రత్నాకర్ ప్రారంభించారు. ఆలయ కమిటీ సభ్యులు వైఎస్సార్‌సీపీ నేతలను దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో 80వ వార్డు ఇన్‌చార్జి కొణతాల భాస్కరరావు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

రైతుహక్కులపై పోరాడిన యోధుడు వీవీ రమణ



రమణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దాడి రత్నాకర్



వీవీ రమణ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వెంకటరమణ

అనకాపల్లిటౌన్ : రైతు హక్కులపై పోరాటాలు చేసిన వ్యక్తి దివంగత వీవీ రమణ అని వైఎస్సార్‌సీపీ అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకులు దాడి రత్నాకర్ కొనియాడారు. స్థానిక గవరపాలెం 80వ వార్డులో సోమవారం రమణ శతజయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. అనకాపల్లి నుంచి రాజ్యసభ సభ్యులుగా ఎన్నికై ప్రజా సమస్యలపై పోరాడిన వ్యక్తిగా అభివర్ణించారు. రైతులను పలు పరిశ్రమలకు తీసుకెళ్లి వారికి పరిశ్రమల పట్ల అవగాహన కల్పించిన మహానుభావుడని తెలిపారు. 1950–60 మధ్యకాలంలో రైతాంగాన్ని ఏకం చేసి వ్యవసాయదారుల సంఘాన్ని ఏర్పాటు చేశారని వివరించారు. అంతకుముందు రమణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో 80వ వార్డు కార్పొరేటర్ కొణతాల నీలిమ, వార్డు ఇన్‌చార్జి భాస్కరరావు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొన్నారు.

ఘనంగా వీవీ రమణ శతజయంతి వేడుకలు

స్థానిక గౌరీ గ్రంథాలయంలో సోమవారం కీర్తిశేషులు, మాజీ పార్లమెంట్ సభ్యుడు వి.వి.రమణ శతజయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా రమణ చిత్రపటానికి గ్రంథాలయ కార్యదర్శి కాండ్రేగుల వెంకటరమణ పూలమాల వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు బిస్కెట్లు, మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ కోశాధికారి భీశెట్టి కృష్ణ అప్పారావు, మాజీ కార్యదర్శి మళ్ల బాపునాయుడు, కార్యవర్గ సభ్యులు కర్రి హనుమంతరావు, కొణతాల ఫణి భూషణ్ శ్రీధర్, బుద్ధ జోగినాయుడు పాల్గొన్నారు.

నేటి నుంచి 'ప్రకృతి' సాగు కిట్ల పంపిణీ

కశింకోట : మండలంలో ప్రకృతి వ్యవసాయం చేసే గ్రామాల రైతులకు నవ ధాన్యాలు, చిరు ధాన్యాల కిట్లను మంగళవారం నుంచి జి.భీమవరం రైతు భరోసా కేంద్రంలో సరఫరా చేయనున్నట్లు ప్రకృతి వ్యవసాయం మండల ఇన్‌చార్జి ద్వారపురెడ్డి రమణ సోమవారం తెలిపారు. సుమారు 30 రకాలతో కూడిన 12 కిలోల విత్తనాల కిట్ రూ.వెయ్యిగా పేర్కొన్నారు. ఈ విత్తనాలు ఎకరాకు సరిపోతాయని, వీటిని రుతు పవనారంభంలో వచ్చే వర్షాల్లో దున్నుకుని, సిద్ధంగా ఉంచుకున్న భూముల్లో జల్లుకోవాలన్నారు. ఇవి మొలిచి, ఎదిగిన 45 రోజుల తర్వాత భూమిలో కలియ దున్నుకుంటే సహజసిద్ధంగా సేంద్రీయ కర్బన శాతం వృద్ధి చెంది, నేల సారవంతమవుతుందన్నారు. అనంతరం ప్రధాన పంటలు పండించుకోవచ్చన్నారు. దీనికి యూరియా, డీఏపీ వంటి ఎరువులు వేయాల్సిన అవసరం ఉండదన్నారు. సుమారు 5 వేల వరకు ఎరువుల ఖర్చు మిగులుతుందన్నారు. అంతేకాకుండా నవ, చిరు ధాన్యాల సాగులో ఆకు కూరలు, కూరగాయలు కూడా ఉంటాయన్నారు. వాటిని ఇంటి అవసరాలకు వినియోగించుకోవడం తోపాటు అదనంగా ఆదాయం పొందవచ్చన్నారు. మండలంలోని 11 గ్రామాల్లో రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేస్తున్నట్టు వెల్లడించారు. ఈ భూముల్లో నవ, చిరు ధాన్యాల సాగుకు అవసరమైన విత్తనాలను సిద్ధం చేసి, విక్రయించడానికి సన్నాహాలు చేశామన్నారు. ఇతర రైతులకు కూడా వీటిని అందిస్తామన్నారు. ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించడమే దీని ప్రధాన ఉద్దేశమన్నారు.

'మండే' సూర్యుడు

కశింకోట : మండల ప్రజలు సోమవారం సూర్యతాపంతో ఉక్కిరిబిక్కిరి అయ్యారు. 41 డిగ్రీల సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రత నమోదయినట్లు గూగుల్ సమాచారం. దీంతో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు అధిక ఉష్ణోగ్రతతో ప్రజలు ఎక్కువ శాతం ఇళ్లకే పరిమితమయ్యారు. అత్యవసరమైన పనులున్న వారు తప్ప మిగిలిన వారు బయట తిరగడానికి సాహసించలేకపోయారు. దీంతో పంచాయతీ ప్రధాన రహదారులు జన సంచారం లేక వెలవెలబోయాయి. ప్రధానంగా వృద్ధులు, పిల్లలు తీవ్ర ఉక్కపోతతో సతమతమయ్యారు. సాయంత్రం వేసవి వేడి తగ్గినా, ఉక్కబోత మాత్రం పూర్తిగా ఉపశమించని పరిస్థితి. మంగళవారం కూడా ఎండలు దాదాపు ఇలాగే ఉంటాయని వాతావరణ విభాగం సిబ్బంది చెప్తున్నారు.



కశింకోటలో వేసవి ఉష్ణోగ్రతలకు జనాల్లేక ఖాళీగా ఉన్న పంచాయతీ ప్రధాన రహదారి

ప్రకృతి వ్యవసాయంతో ఎంతో మేలు

- జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ లచ్చన్న
- సీతానగరంలో 6400 కిట్ల పంపిణీ



రైతులకు విత్తనాల కిట్లు అందిస్తున్న ప్రాజెక్ట్ మేనేజర్ లచ్చన్న

అనకాపల్లి రూరల్ : ప్రకృతి వ్యవసాయంతో భూమికి, సమాజానికి ఎంతో మేలు జరుగుతుందని ఏపీసీఎన్ఎఫ్ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ సీహెచ్ లచ్చన్న తెలిపారు. సోమవారం సీతానగరంలో అనకాపల్లి, కశింకోట మండలాల్లోని 24 గ్రామాలకు చెందిన రైతులకు 6400 విత్తనాల కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ సాగు విస్తీర్ణం ఏటేటా పెరుగుతోందన్నారు. ఈ విధానం ద్వారా సాగు చేసిన వ్యవసాయ ఉత్పత్తులు రసాయనరహిత, ఆరోగ్యకరమైన పంటలులుగా పేర్కొన్నారు. ప్రకృతి వ్యవసాయానికి ప్రభుత్వం ఎన్నో రాయితీలిస్తూ, ప్రోత్సహిస్తోందన్నారు. విత్తనాల కిట్లలో నవధాన్యాల సాగుకు సంబంధించిన విత్తనాలతో పాటు 30 రకాలున్నట్టు వెల్లడించారు. ప్రతి ఇంట్లో పెరటి సాగు ద్వారా ఆరోగ్యకరమైన కూరగాయలు, ఆకుకూరలు పండించుకోవచ్చని సూచించారు. ఈ తరహా వ్యవసాయం ద్వారా పెట్టుబడి తగ్గడమే కాకుండా అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. ఘన, ద్రవ జీవామృతం తయారీ, కషాయాల తయారీ గురించి వివరించారు. కార్యక్రమంలో సీతానగరం, వెంకుపాలెం, తగరంపూడి, సుందరయ్యపేట సర్పంచ్‌లు చంటి, నాగేశ్వరరావు, అప్పారావు, డి.ధనలక్ష్మి, ఎంపీటీసీలు ఏ రాము, వెంకటేశ్వరరావు, డి.తాతారావు, ప్రకృతి వ్యవసాయ డివిజన్ సిబ్బంది పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
అనకాపల్లి :
9010973030, 9010546644
Office mail : sakshiadvtvsp@gmail.com